

# దొంగలో? దొరలో!

ఊరికి అల్లంత దూరాన రంగడు అమరయ్య పొలానికి గొర్రె పెంట పెడ్తున్నాడు. రాత్రి పదిగంటలు దాటింది. గొర్రెలు చేలో మిగిలిన గరికా బరికా తిన్నంత సేపు తిని తిరిగినంతసేపు తిరిగి నిద్రకు పడ్డాయి. చలిగాలి కొరికేస్తుంటే రంగడు గట్టుమీద కూర్చుని చుట్ట ముట్టించుకుందుకు చెకుముకిరాయి తీశాడు. ఎంత కొట్టినా వెలగదు. కప్పుకున్న గొంగళి సళ్ళిస్తే చలిగాలి లోపలికి దూసుకొచ్చి చర్మం కోసేస్తోంది. పైగా ఆ చలికి తనతోపాటు గొంగళిలో కూర్చున్న మేకపిల్ల 'మే' అని ఏడుస్తోంది. రాయికొట్టగా కొట్టగా ఎట్టకేలకు దూది అంటుకుంటే దాంతో చుట్ట ముట్టించుకొని గుప్పు గుప్పున పొగవదిలి లోపలికొచ్చే చలిని "పో పొమ్మని" బైటికి తోలాడు. మేకపిల్లని మరింత వొళ్ళో పొదువుకుని వీపు నిమురుతున్నాడు. వెచ్చగా ముడుచుకుని నిద్రకు పడ్డది మేకపిల్ల.

చిన్నప్పుడు పొలానికి గొర్రె పెంట పెట్టడానికి తనూ తండ్రితో వచ్చి తండ్రి వొళ్ళో అలాగే వెచ్చగా పడుకునేవాడు.

చీకటి గుయ్యారంగా ఉంది. మందలోంచి ఓ గొర్రె లేచి కదులుతున్నట్లు అనిపిస్తే రంగడు చెంగున లేచి 'ఓహోస్' అంటూ దాన్ని అదిలించి తిరిగి మందలోకి తోలాడు. చీకట్లో ఓసారి గొర్రెలన్నింటినీ చూసుకున్నాడు. ఎంత

చీకటయినా తన గొర్రెలు తనకి తెలవ్వా, "మచ్చలది, మాఠిది, తోలుకొమ్ముల్ది, చిన్నకాళ్ళది, చిరతపులివారది, తెల్లది, నల్లది, ఎత్తుకాళ్ళది, బోదది, కుంటిది, కులాసది, ఏడుపు గొట్టుది, ఎర్రమన్నుది ..... అన్నీ ఇరవై లెక్కే ..... మళ్ళీ మేకపిల్లని చంకనేసుకుని గట్టుమీద కొచ్చి కూర్చున్నాడు. చుట్ట ఆరిపోయింది. వెలిగించుకోటానికి ఇష్టంలేక ఆరిన చుట్టని చెవులో పెట్టుకుని చీకట్లోకి కళ్ళు పెట్టుకు చూస్తున్నాడు. బీట్లో కీచురాళ్ళు 'గీ' మంటూ అరుస్తున్నాయి. చెరువులో కప్పలు ఉండుండి బెక బెకమంటున్నాయి. పెద్దింటమ్మ గుడిమీంచి గుడ్లగూబ భయంకరంగా అరుస్తూ ఎటో వెళ్ళిపోయింది. రంగడికి నిద్రమత్తులాంటిది వచ్చింది. అంతలో డొంకలో మోతలకి టక్కున మెలకువ వచ్చింది.

చెవులు రిక్కించి విన్నాడు రంగడు.

మనుషులు నడుస్తున్న చప్పుడు. మామూలు మనుషుల అడుగులు కావవి, ఆ వేగం ఆ అడుగు వేరు గబా ..... గబా ..... గబా..... అడుగులు, నేల మీద ముల్లుగర్ర పోట్లు కావవి, గడ్డపారల పోట్లు. అది గజదొంగల నడక. బందిపోట్ల నడక. రంగడికి గుండెలవిసిపోయాయి. డొంకకి ఎకరన్నర ఇవతల ఉన్నా "టంగ్ టంగ్ టంగ్ టంగ్" అని వినిపిస్తున్నాయి గడ్డపారల మోతలు. "టాక్ టాక్ టాక్ టాక్" పరుగులాంటి నడక. చీకట్లో డొంకకి దూరాన ఉన్నాడు కాబట్టి తనకి తన మందకి ఏం ఫర్వాలేదు అని స్తిమితపడ్డాడు. కాని మరుక్షణంలో వీళ్ళు ఊరు దోచేస్తే అని భయం వేసింది. ఏంచేయాలో తెలిసింది కాదు. తెలిసి తన కళ్ళముందు ఇంత ఘోరం జరగుతుంటే చేతులు ముడుచుకు కూర్చోబుద్ధి కాలేదు.

చెంగున లేచాడు. గొంగళి మేకపిల్లకి కప్పాడు. చలంతా ఏమైందో తెలియదు. తక్కుతూ తారుతూ పొలంలోంచి బయటకొచ్చి అడ్డదోవన కృష్ణ వొడ్డునుంచి పరుగులంకించుకొని రొప్పుకుంటూ అమరయ్య ఇంటికొచ్చి పడ్డాడు.

"అయ్యగారూ! దొంగలు .... డొంకలోంచి వస్తున్నారు ..... నే..... నే జూశాను ఆయాసంతో అన్నాడు. అమరయ్య తొణకలేదు. బెణకలేదు. మంచంమీద

లేచి కూర్చుని చుట్టకాల్చుకొని ఆయాసపడుతున్న రంగణ్ని చూసి "మంచినీళ్ళు తాగు" అని చెంబు చూపించాడు. రంగడు చెంబు చెయ్యికి అడ్డం పెట్టుకుని నీళ్ళు తాగాడు. కాని దడ తగ్గలేదు. అమరయ్య రంగణ్ని చూస్తూ అన్నాడు. "నాయాల దొంగలొస్తే మేం కాసుకోలేమంట్రా? మేం లేవా? మా పాలేళ్ళు లేరా? పాలాన గొర్రెల్నిడిచిపెట్టి వస్తావంట్రా? కాని పనులు నీకెందుకురా ఫో."

రంగడు బిత్తరపోయాడు.

"పో పో! నీ పని చేసుకో పో" గదిమాడు అమరయ్య.

వెనక్కి తిరిగాడు రంగడు. ఈ తడవ పరుగెత్తలేదు కాని కాళ్ళీడ్చుకుంటూ క్రిష్ణ వొడ్డున నడిచొస్తూ 'ఇది కాని పని ఎట్లాగయిందబ్బా!' అని తర్కించుకున్నాడు. ఏమీ తెలిసింది కాదు.

తెల తెలవారుతుండగా కూలీలు పొలాలకొస్తూ చెప్పుకుంటున్నారు. రాత్రి సెట్టి ఇంటికి కన్నాలేసి దొంగలు జొరబడ్డారని, సెట్టి మెలకువతో ఉన్నాడు కాబట్టి సరిపోయిందని, అయినా సెట్టి పెళ్ళాం మెళ్ళో నాంతాడు తెంచుకుపోయారని. బారెడు పొద్దెక్కేసరికి రంగడికి కబురొచ్చింది. దొంగల వివరం తెలుసు కుందుకేమో అనుకున్నాడు రంగడు.

అమరయ్య పాలేళ్ళచేత సెట్టికి కబురందించాడు! "దొంగలు రంగడి తాలూకు మనుషులని. అవసరమైతే పట్టుబడి పారిపోయిన దొంగ రంగడి పేరుచెప్పాడు అని చెప్పమని."

సరిగ్గా అలాగే జరిగింది పంచాయితీ. రంగడు లబో దిబో మన్నాడు. "దొరా! దొంగల సంగతి ముందు చెప్పింది నేనేగదు దొరా!" అని మొత్తుకున్నాడు.

"మరి దొంగలు నీ పేరు చెప్పారే?" అన్నాడు అమరయ్య.

వస్తువు సంగతి ఆ తర్వాత ఆచూకీ తీద్దాం ముందు రంగడికి పది గొర్రెలు శిక్ష వేయండన్నారు. రంగడు కుప్పకూలిపోయి అందరి కాళ్ళకీ మొక్కాడు. లాభం

లేకపోయింది. పది గొర్రెలతో వారం రోజులపాటు ఆనందంగా విందులు చేసుకున్నారు అమరయ్య జనం.

రంగడికి అర్థమైంది. దొంగలు అమరయ్య మనుషులు. అమరయ్య మీద కసి పెరిగిపోయింది. తనకి ఇల్లా వాకిలా? ఊరా?వాడా? తన ఆస్తంతా ఈ పాలిచ్చే జంతువులే కదా! అందులో సగం తరిగిపోయాయాయె? పున్నానికెడితే పాపమెదురొచ్చెనే? అని కుమిలిపోతూ తన గోడంతా మేకపిల్లకి, ఎర్రి గొర్రెకి, మచ్చల గొర్రెకి, పగలూ రాత్రీ చెప్పుకోడం మొదలెట్టాడు. ఆ గొర్రెలు విన్నట్టే తలలూపాయి. కుంటకీ డొంకకీ చెప్పుకున్నాడు. అవి మాట్లాడలేదు.

పదిరోజుల తర్వాత సుబ్బయ్య పొలంలో గొర్రె పెంట పెడ్తున్నాడు రంగడు. అర్థరాత్రివేళ డొంకలో అవే అడుగులు. అవే గునపం పోట్లు. బంతిలా లేచి రంగడు డొంకలో కొచ్చి "అన్నలారా!" అంటూ దొంగల కాళ్ళమీద పడ్డాడు. గోలు గోలున ఏడుస్తూ తన గోడు చెప్పాడు. "అమరయ్య నాకన్యాయం చేశాడయ్యా?" మీ ఆచూకీ చెప్పినందుకు నా గొర్రెలు కాజేశారయ్యా! మీరన్నా ఆదుకోండయ్యా."

యములాళ్ళలా ఉన్న దొంగలు "ఎంత డబ్బో చెప్పు. ఇప్పిస్తాం" అన్నారు. "నాకు డబ్బెందుకయ్యా! పాలిచ్చే పశువులు గావాలి గాని" అన్నాడు రంగడు.

గంటలో వస్తాం ఈ డొంకలోనే ఉండమని వెళ్ళిపోయారు దొంగలు. గంట తిరిగేసరికి దొంగలు అమరయ్య పాడి ఆవు, లేగదూడతో వచ్చి రంగడికి అప్పచెప్పి వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

రంగడికి ఏం చేయాలో తెలియలేదు. పాపమో,పుణ్యమో తెలియటం లేదు. న్యాయమో, అన్యాయమో తెలియటంలేదు. చేతికొచ్చిన పాడావును వుంచుకోవాలో, వదలాలో తెలియలేదు. ఎవరాదుకుంటున్నారో, ఎవరన్యాయం చేస్తున్నారో తెలియక తబ్బిబ్బయినాడు. పాలిచ్చే పశువు తన ప్రాణం అంతే.

పొలంలోని గొర్రెల్ని డొంకకి మళ్ళించాడు రంగడు. నిమిషాలమీద పొలిమేర దాటించాడు. పొద్దు రెండు బారలొచ్చేసరికి అమరావతికి ఆరూళ్ళ అవతలికి పాడి ఆవుతో సహా వెళ్ళిపోయాడు.*